# గ్రామీణ ప్రజలను అసంఘటిత వలసకూలీలుగా పరిశ్రమాధిపతులకు అందిస్తున్న పాలకులు

**రైతే** రారాజు, రైతులేనిదే రాజ్యమే లేదు అన్న రైతాంగం నేడు బంట్రోతు ఉద్యోగికన్నా అతి తక్కువ ఆదాయం పొందుతూ దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. ఒకప్పుడు రైతుకు ఉండే గౌరవం కలెక్టర్‌కి కూడా వుండేది కాదు. అలాంటి రైతాంగం నేడు చాలా హీనంగా చూడబడుతున్నాడు. సేద్యం ద్వారా ఎవరికీ తలవంచకుండా జీవితం గడిపిన రైతాంగం నేడు ఆ సేద్యం వలనే బలవన్మరణాల పాలౌతున్న విషాద పరిస్థితి ఏర్పడింది. సేద్యపు ఖర్చులు పెరగటం, పంటలకు న్యాయమైన ధరలు లభించక, మార్కెట్ సౌకర్యంలేక అప్పులపాలవటమే అందుకు కారణం.

బ్రిటిష్ వలస పాలకులతో లాలూచీపడి వారి ప్రయోజనాలు కాపాడుతామని హామీ యిచ్చి వారి చేతుల నుండి అధికారాన్ని పొందిన దేశ దళారీ పాలకులు, దేశప్రయోజనాలకు అనుగుణమైన వ్యవసాయ విధానాలు అమలుజరపకుండా, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలు అనుసరిస్తూ వస్తున్నారు. అధిక దిగుబడుల పేరుతో ప్రవేశపెట్టిన సస్యవిప్లవం, సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం, వ్యవసాయ ఒడంబడికలకు ఆమోదం తెలపటంద్వారా సామ్రాజ్యవాదుల దోపిడీకి భారతదేశాన్ని మంచి వనరుగా మార్చారు.

దేశీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి, రైతాంగాన్ని భూముల నుండి తొలగించి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, గ్రామీణ ప్రజల జీవనాన్ని చిన్నాభిన్నం చేసి దేశీయ-విదేశీ బడాపరిశ్రమాధిపతులకు వారిని వలసకూలీలుగా మార్చటమన్న విధానాన్ని పాలకులు అనుసరిస్తున్నారు. ప్రపంచబ్యాంక్ అందుకు కారణం. వచ్చే 20 సంవత్సరాలకాలంలో దేశంలోని గ్రామీణ ప్రాంతంలోని 40 కోట్ల మంది ప్రజలను పట్టణ ప్రాంతాలకు తరలించాలంటూ 1996లో ప్రపంచబ్యాంక్ భారత ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమర్ధతలేని దేశీయ రైతాంగం చేతుల్లో అత్యంత విలువైన భూమి చిక్కుబడి వుందని ప్రపంచ బ్యాంక్ చెప్పటం భారత రైతాంగాన్ని అవమానపర్చటమే. రైతాంగాన్ని భూముల నుండి తొలగించి పారిశ్రామిక కార్మికులుగా మార్చాలని 2008లో దళారీ పాలకులకు బోధించింది. సామ్రాజ్యవాదుల అడుగులకు మడుగులొత్తుతున్న పాలకులు ప్రపంచబ్యాంక్ సూచనలు అమలుపర్చటానికి 2009లో రైతాంగాన్ని పారిశ్రామిక కార్మికులుగా మార్చేందుకు వెయ్యి పారిశ్రామిక శిక్షణా సంస్థలను ఏర్పాటుచేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ప్రపంచబ్యాంక్ సూచనను గుడ్డిగా పాటించటమే జరుగుతోంది. దేశంలో 70శాతం రైతులు వ్యవసాయ రంగంలో అదనపు జనాభాగా వున్నారని, వీరిని పట్టణ ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం వుందని యు.పి.ఏ. ప్రభుత్వ ప్రధానమంత్రి పదేపదే చెబుతూ వచ్చారు. దేశంలో అతిపెద్ద సంస్కరణ వ్యవసాయరంగంలోని జనాభాను పెద్దఎత్తున నగరాలకు తరలించటమేనని ఆర్.బి.ఐ. గవర్నర్ రఘురామ్‌రాజన్ బహిరంగంగా ప్రకటించాడు. ఎన్‌డిఏ ప్రభుత్వ ఆర్థికమంత్రి ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశ జనాభాలోని అత్యధిక భాగానికి వ్యవసాయం జీవనోపాధి కల్పించలేకపోతుందని, అసమానతలకు ఇదే కారణమని తేల్చారు.

ఇప్పటికీ 60శాతంపైగా గ్రామీణ ప్రజలకు వ్యవసాయమే ఉపాధి కల్పిస్తున్నది. పారిశ్రామిక ఉత్పత్తులకు అవసరమైన ముడి ఉత్పత్తులు వ్యవసాయం నుండే అందుతున్నాయి. దేశ పారిశ్రామికరంగం అభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధిపైనే ఆధారపడి వుంది. గ్రామీణ ప్రజల ఆర్థిక పరిస్థితిపెంచి వారి జీవన ప్రమాణాలు పెంచటంద్వారా అది సాధ్యమౌతుంది. భారత దళారీ పాలకులు ఈ వాస్తవం తెలిసే అందుకు వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ వ్యవసాయ సంక్షోభాన్ని సృష్టించి కొనసాగిస్తున్నారు.

పాలకుల విధానాల ఫలితంగా దేశీయ వ్యవసాయ రంగం సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ఆధిపత్యంలోకి వెళ్లింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలను, పంటల ధరలను బహుళజాతి సంస్థలే నిర్ణయిస్తున్నాయి. దేశంలో వ్యవసాయ పరిశోధనలను మోన్‌శాంటో, కార్గిల్, డ్యూపాంట్, సింజెంటా కంపెనీలకు పాలకులు అప్పగించారు. ప్రమాదకరమైన, ప్రజల ప్రాణాలకు హాని కలిగించే పరిశోధనలను అవి దేశంలో కొనసాగిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వున్న 27 ప్రభుత్వ పరిశోధనా కేంద్రాలను మూసివేసి వాటి టెక్నాలజీని ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టారు. వ్యవసాయశాఖను పూర్తిగా ప్రక్కన పెట్టారు.

దేశంలో 12 కోట్లమంది రైతులు వున్నారు. వీరిలో 80 శాతం చిన్న, సన్నకారు రైతులే. 60 శాతంపైగా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయాన్ని పాలకుల విధానాలు నిర్వీర్యం చేస్తున్నాయి. పెరుగుతున్న పంటల ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా న్యాయమైన ధరలు లభించటంలేదు. క్వింటా వరి ధాన్యానికి 1910 రూ. ఖర్చు అవుతుందని పంటల ధరల సాధికారిక సంస్థే ప్రకటించగా, కేంద్రం దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సాధారణ రకానికి 1470, మేలు రకానికి 1510 రూపాయలు మద్దతు ధరగా ప్రకటించింది. ఇది రైతుల ప్రయోజనాలను దెబ్బతీసింది. ఈ ధరలు రైతాంగానికి నామమాత్రపు మిగులును కల్పిస్తున్నది. ఫలితంగా కుటుంబ పోషణకు, తిరిగి సేద్యపు ఖర్చులకు చేసిన అప్పు తీరకుండానే తిరిగి అప్పులు చేయాల్సివచ్చి రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆ ఊబినుండి బయటపడలేక గిలగిలా కొట్టుకొంటున్నారు.

రైతాంగం సంక్షోభానికి కారణమైన మౌలిక సమస్యలు పరిష్కరించని పాలకులు, చిన్న కమతాల సేద్యం నష్టదాయకంగా వుందని, కాంట్రాక్టు సేద్యం వలన అధిక ఆదాయం వస్తుందని, చిన్న, సన్నకారు రైతులు కాంట్రాక్టు సేద్యానికి భూములు ఇవ్వమని దుర్మార్గమైన ప్రచారం చేస్తున్నారు. దేశీయ అనుభవాలతోపాటు, అంతర్జాతీయ అనుభవం కూడా చిన్న కమతాల రైతులే ఎక్కువ మిగులు ఆదాయం పొందుతున్నారని వెల్లడించింది. దేశంలో చిన్న కమతాలే లాభసాటిగా వున్నాయని, వారే ఎక్కువ ఆదాయం పొందుతున్నారని ఇటీవలే ఒక నేషనల్ శాంపిల్ సర్వే బట్టబయలు చేసింది. రెండున్నర ఎకరాలు వున్న చిన్నకారు రైతు 14,754 రూపాయల మిగులు ఆదాయం పొందితే, సన్నకారు రైతు 13,001, ధనికరైతు 10,655, పెద్ద రైతు 8,783 రూపాయల ఆదాయం పొందారని పేర్కొంది. దీన్ని పాలకులు ఎందుకు మభ్యపెడుతున్నారు? భూవికేంద్రీకరణ, భూపంపిణీ జరగాలనే వాస్తవాన్ని కూడా ఆ సర్వే వెల్లడించింది. ప్రభుత్వ ప్రచారం కార్పొరేట్ సంస్థలకోసమన్న దాన్ని స్పష్టం చేస్తోంది.

ఒకప్పుడు రారాజు అనిపించుకొన్న రైతాంగం నేడు పాలకుల దయాదాక్షిణ్యాలకోసం ఎదురుచూడాల్సి వస్తున్నది. వ్యవసాయాన్ని పాలకులు దండగగా మార్చటంతో చిన్న, సన్నకారు రైతుల ఆదాయం చాలా తక్కువగా వుండి కుటుంబ అవసరాలను కూడా తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడింది. కుటుంబ వినియోగం కోసం వెచ్చిస్తున్న మొత్తంతో వ్యవసాయంద్వారా ఒక రైతు పొందుతున్న సగటు సంవత్సర ఆదాయం 20వేలు మాత్రమే. నెలవారి ఆదాయం 1,666 రూ. అని 2016 ఆర్థిక సర్వే స్పష్టంచేసింది. జాతీయ స్థాయిలో రైతు కుటుంబం మొత్తానికి నెలసరి ఆదాయం 3 వేలు మాత్రమేనని సర్వే నివేదిక పేర్కొంది. నాల్గవ తరగతి ఉద్యోగి నెలసరి ప్రాథమిక ఆదాయం 18 వేలు. ఆరుగాలం భూమిలో రెక్కలు ముక్కలు చేసుకొని ఆహారపంటలు పండించే రైతుకు వచ్చేది మాత్రం 1,660 రూపాయలు. ఇది రైతాంగ దుర్భర పరిస్థితులకు అద్దంపడుతున్నది. ఇలాంటి ఆదాయంతో గ్రామీణ ప్రాంతంలోని 70 శాతం మంది ప్రజల జీవన విధానం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు 2015లో ప్రచురించిన సామాజిక ఆర్థిక సర్వే పేర్కొంది.

కాంట్రాక్టు వ్యవసాయాన్ని పాలకులు ప్రోత్సహిస్తున్నారు. ఈ వ్యవసాయం వలన ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని, ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని, ఎగుమతి ఆధారపంటల వలన రైతుల ఆదాయం పెరుగుతుందని పాలకులు ప్రచారం చేస్తున్నారు. పాలకులు పైకి ఈ మాటలు చెబుతున్నా, ఆచరణలో రైతాంగాన్ని సేద్యంనుండి ప్రక్కకు తప్పించటమే. కాంట్రాక్టు పద్ధతి రెండు రకాలుగా వుంది. **మొదటిది :** తనకు అవసరమైన పంటను పండించే కాంట్రాక్టును రైతుకు కాంట్రాక్టరు అప్పగించటం, అందుకు ధరను ముందే నిర్ణయించటం. **రెండవది :** తన భూమిని నిర్ణీతకాలంపాటు రైతు కంపెనీకి లీజుకివ్వటం. లీజుకి అనుగుణంగా సంవత్సరానికి డబ్బుతీసుకోవటం. ఈ రెండు పద్ధతులు రైతు ప్రయోజనాలను హరించేవే. బహుళజాతి సంస్థలకు పెద్దఎత్తున లాభాలు చేకూర్చిపెట్టేవే!

కాంట్రాక్టు పద్ధతిన కుదుర్చుకొన్న ఒప్పందాలను తమ ఇష్టానుసారంగా కంపెనీలు అమలుపర్చాయి. తమ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించి, రైతాంగాన్ని నష్టానికి గురిచేసిన అనుభవాలు అనేకం వున్నాయి. 1989లో పెప్సీ ఫుడ్స్ లిమిటెడ్ పంజాబ్‌లో టమోటా ప్రాసెసింగ్ ప్లాంట్ ద్వారా కాంట్రాక్టు సాగు ప్రారంభించింది. రైతాంగంతో ఒప్పందం కుదుర్చుకొని తన కవసరమైన టమాటా సాగుచేయించింది. ప్రారంభంలో కొంతమేర రైతుకు ఆదాయం పెరిగింది. ఆ తర్వాత మార్కెట్ రేటు తక్కువగా వుంటే రైతుల పంటకు క్వాలిటీ లేదంటూ తక్కువ రేటుకి కొనుగోలు చేయటం, ఎక్కువరేటు వుంటే అగ్రిమెంటు రేటుకే కొనుగోలు చేయటంవలన రెండు విధాల రైతులు నష్టపోతున్నారు. రాష్ట్రంలోని చిత్తూరుజిల్లా కుప్పం అనుభవం మరింత దారుణంగా వుంది. భూములు యిచ్చిన రైతులకు కౌలు డబ్బులు ఇవ్వకపోవటం, అడిగితే రైతులపై దాడులుచేయటం, రైతులే భూములు సేద్యం చేసుకొందామంటే సరిహద్దు చెరిగిపోయి భూములు ఎక్కడ వున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. రైతాంగం తీవ్రంగా నష్టపోయారు. చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా 12 లక్షల ఎకరాలను కంపెనీల చేతుల్లో పెట్టడానికి సిద్ధమైంది. కాంట్రాక్టు సేద్యం అగ్రిమెంటుపై రైతు సంతకం చేశాడంటే కంపెనీకి బానిసగా మారినట్లే. కాంట్రాక్టు వ్యవసాయాన్ని ప్రారంభించిన మహారాష్ట్రలోనూ రైతాంగానికి చేదు అనుభవాలే ఎదురయ్యాయి.

కాంట్రాక్టు-కార్పొరేట్ వ్యవసాయం పేరుతో పరోక్షంగా రైతుల భూములు కంపెనీలకు అప్పగించే విధానాలు అమలు జరుపుతూనే, సెజ్‌లు, కారిడార్‌లు, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, విమానాశ్రయాలు, అణువిద్యుత్ కేంద్రాల పేరుతో నేరుగా ప్రభుత్వమే రైతుల భూములను బలవంతంగా గుంజుకొని లక్షలాది ఎకరాలను బహుళజాతి సంస్థలకు, బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతున్నది. దేశవ్యాపితంగా 2006 నుండి నేటివరకు 29 లక్షలపైగా వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించబడ్డాయి. 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లక్షా 29 వేల ఎకరాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. గత రెండు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో 4,17,608 ఎకరాల భూమి వ్యవసాయేతర ఖాతాలోకి మళ్ళించబడింది. దేశ, విదేశీ బడా సంస్థలకు లేదనకుండా భూములు యిచ్చేందుకు 15 లక్షల ఎకరాలతో భూ బ్యాంక్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు పేదలకిచ్చిన అసైన్డ్ భూములను ప్రధాన లక్ష్యంగా చేసుకొంది. ఉమ్మడి రాష్ట్రంలో లక్షల ఎకరాల అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోగా, చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 7,82,296 ఎకరాల స్వాధీనంకోసం పూనుకొంది. ఈ ప్రక్రియ 2016లో పూర్తిచేయాలని నిర్ణయించింది.

ప్రభుత్వ భూసేకరణకు నెల్లూరుజిల్లా అగ్రభాగాన నిలిచింది. రాష్ట్ర భూభాగంలో 13.18 శాతం వాటా గల ఈ జిల్లాలో 7.5 లక్షల ఎకరాలు వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు స్పష్టమైంది. రాజధాని పేరుతో గుంటూరుజిల్లాలో లక్ష ఎకరాలు, పోర్టు, పారిశ్రామికవాడ పేరుతో కృష్ణాజిల్లా మచిలీపట్నం ఏరియాలో లక్ష ఎకరాలు, అణువిద్యుత్ కేంద్రాలు, విమానాశ్రయాల పేరుతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వేలాది ఎకరాల భూములు బలవంతంగా లాగేసుకొనే ప్రక్రియ ప్రభుత్వం ప్రారంభించింది. ఈ భూములు విదేశీ సంస్థలకు కట్టబెట్టేందుకు, వారికి ఎర్రతివాచీలు పర్చి మరీ ఆహ్వానిస్తున్నది. ఈ విధంగా లక్షలాది ఎకరాల సేద్యపు భూములు సేద్యేతర అవసరాలకు మళ్ళించబడుతున్నాయి.

పాలకులు అనుసరించిన రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితంగా సేద్యపు భూమి విస్తీర్ణం తరిగిపోతూ ఉన్నది. 1971-72 సంవత్సరంలో దేశవ్యాపితంగా 119.636 మిలియన్ హెక్టార్ల సేద్యపు భూమి ఉండగా 2013 నాటికి 92.359 హెక్టార్లకు తగ్గిపోయింది. ఇంత పెద్దఎత్తున సేద్యం తగ్గటం ఆందోళన కలిగించే అంశం. చిన్న, సన్నకారు రైతులు సేద్యపు భూములు కోల్పోవటానికి, వ్యవసాయం ఆశాజనకంగా లేకపోవటం కారణంగా ఉంది. భూములు కోల్పోయిన చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ కూలీల వర్గంలో చేరిపోయారు. ఫలితంగా వారి సంఖ్య 58 శాతానికి పెరిగింది. వ్యవసాయరంగంపై ఆధారపడే వ్యవసాయ కూలీలు 108 నుండి 144 మిలియన్లకు పెరిగారు. 2001లో వ్యవసాయదారుల సంఖ్య 122.3 మిలియన్లు ఉండగా నేడు 118.7 మిలియన్లకు తగ్గారు.

సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగం గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించలేకపోయింది. ఫలితంగా గ్రామీణ పేదలు చాలామంది ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్ళారు. గ్రామీణ ప్రజలు పట్టణాలకు తరలాలని చెప్పిన పాలకులు, అలా వెళ్ళిన పేదలకు పారిశ్రామికరంగం ఉపాధి కల్పించటంలో విఫలమైంది. 2007 సం॥లో 3.7 కోట్లమంది భారత రైతులు వ్యవసాయాన్ని వదలి పట్టణాలకు వలస వెళ్ళారని "క్రిసిక్" అనే ప్రపంచస్థాయి విశ్లేషణ సంస్థ వెల్లడించింది. అలా వలస వెళ్ళిన వారిలో 1.5 కోట్లమందికి ఉపాధి దొరకక తిరిగి గ్రామాలకు వచ్చారని పేర్కొంది. కొద్దిమంది గ్రామీణ పేదలకే పారిశ్రామిక రంగంలో ఉపాధి కల్పించలేని పాలకులు 40 కోట్ల గ్రామీణ ప్రజలను పట్టణాలకు తరలించి వారికి ఉపాధి ఏవిధంగా కల్పించగలుగుతారు? గ్రామీణ ప్రజల తరలింపు ఉద్దేశం వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసి, బడా పరిశ్రమాధిపతులకు చౌకగా రోజువారీ కూలీలను అందించేందుకే. ఇది పారిశ్రామిక కార్మికులుగా మార్చటంకాదు. ఇప్పటికే వలసపోయిన గ్రామీణ పేదలు చాలామంది అపార్ట్‌మెంట్లవద్ద కాపలాదారులుగాను, సంపన్నవర్గాల భవంతుల్లో పాచిపనులు చేసేవారిగా బ్రతికేవారు కొందరైతే, అనేకమంది మహిళలు పడుపు వృత్తి చేసి కుటుంబాలను పోషించవలసిన దయనీయ పరిస్థితులకు నెట్టబడ్డారు. ప్రపంచబ్యాంక్ చెప్పినట్లు 40 కోట్లమంది పట్టణాలకు తరలితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో వూహించలేని పరిస్థితి.

పాలకుల విధానాల ఫలితంగా రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. బలవంతంగా భూములు లాక్కోవటం, పంట ఖర్చులు పెరుగుతున్నా; ఆ పంటలకు న్యాయమైన ధరలు లభించక, దళారుల దోపిడీకి గురై అప్పులపాలౌతున్నారు. దేశ వ్యాపితంగా 60 శాతం రైతులు సగటున 95 వేల అప్పుతో ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 90 శాతం రైతులు అప్పులు ఊబిలో ఉన్నారు. ఈ ఊబి నుండి బయటపడలేక, అవమానాలు భరించలేక చావే పరిష్కారంగా బలవన్మరణాలకు పాల్పడుతున్న హృదయ విదారక రైతుల దృశ్యాలు కళ్ళముందు కదలాడుతున్నాయి. గత 20 సంవత్సరాల కాలంలో దేశవ్యాపితంగా మూడు లక్షల 15 వేలమంది రైతులు బలవన్మరణాల పాలయ్యారు. రోజుకి 45 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 2004-13 సంవత్సరాల మధ్యకాలంలో ప్రతి సంవత్సరం 10 నుండి 15 వేలమంది రైతులు బలవన్మరణాల పాలౌతున్నారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 17 వేలకు పైగా రైతులు ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రం విడిపోయిన రెండు సంవత్సరాల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో వందల సంఖ్యలో బలవన్మరణాలకు రైతులు గురైనారు.

రైతుల బలవన్మరణాలపై దేశవ్యాపితంగా పాలకులపై వ్యతిరేకత వ్యక్తమైంది. ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలనే డిమాండ్ తీవ్రంగా ముందుకు వచ్చింది. ఆత్మహత్యలకు కారణమైన మౌలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా, వాటిని మభ్యపెడుతూ యుపిఏ, ఎన్‌డిఏ ఒకేవిధంగా వ్యవహరిస్తున్నాయి. యుపిఏ ప్రభుత్వం చనిపోయిన రైతు కుటుంబానికి లక్షా 20 వేలు పరిహారం ప్రకటిస్తే దాన్ని ఎన్‌డిఏ ప్రభుత్వం 4 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఆంధ్ర రాష్ట్రంలో ఈ పరిహారం లక్షా యాభైవేలుగా ఉంది. దీని వలన రైతుల ఆత్మహత్యలు ఆగిపోవు. ఆత్మహత్యలు ఆగిపోయే చర్యలు తీసుకోబోమని రెండు ప్రభుత్వాలు పరోక్ష రూపంలో తెలియచేశాయి.

రైతుల బలవన్మరణాలపై కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను నిరశిస్తూ పంజాబుకి చెందిన స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల కేసు వేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికలో వ్యవసాయానికి సంబంధంలేని ఇతర కారణాల వలన రైతుల ఆత్మహత్యలు సాగుతున్నాయని పేర్కొంది. కేంద్ర-రాష్ట్ర మంత్రులు ఇంకా నీచమైన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లో గత మూడు సంవత్సరాల కాలంలో ఆత్మహత్యలు చేసుకొన్న రైతులందరూ దెయ్యంపట్టిన వాళ్ళేనంటూ ఆ రాష్ట్ర హోంమంత్రి భూపేంద్రసింగ్ లిఖితపూర్వక సమాధానం ఇవ్వటం ద్వారా రైతుల ప్రాణాలను చులకన చేశాడు. మహారాష్ట్ర

బి.జె.పి. పార్లమెంటుసభ్యుడు సంజయ్ ధోత్రే 'రైతులను వాళ్ళమానాన వాళ్ళని వదలిపెట్టండి. వాళ్ళు చనిపోతే పోనివ్వండి, ఎవరికి శక్తి ఉందో వారే పంటలు పండిస్తారు' అన్నాడు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా జుగుప్సాకరమైన ప్రకటన చేశాడు. నీటిపారుదల సౌకర్యాలు లేక రైతులు ఇక్కట్లపాలౌ తున్నారని చెప్పగా 'ఢిల్లీలో ఉన్న భవంతి ఆవరణలో మొక్కలు ఉన్నాయని, వాటికి మాత్రం పోస్తున్నానని' ఆయన అన్నాడు. ఈవిధంగా ఆయన ఎంతో దిగజారి మాట్లాడాడు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ కూడా ఇలాంటి అభ్యంతరకర మాటలు చెప్పాడు. ప్రేమలో విఫలం చెందటం వలనే రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని చెప్పి రైతుల ఆగ్రహానికి గురైనారు. గతంలో చంద్రబాబు ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. పరిహారం కోసమే రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, పరిహారం యిస్తే ఆత్మహత్యలు పెరుగుతాయని రైతుల ప్రాణాలను అపహాస్యం చేశాడు. ఈ విధంగా కేంద్ర, రాష్ట్రమంత్రులు రైతుల బలవన్మరణాలపై స్పందించిన తీరు జుగుప్సాకరమైంది.

కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే వ్యవసాయ సంక్షోభానికి, రైతుల బలవన్మరణాలకు కారణమన్న వాస్తవాన్ని రైతాంగం అర్థం చేసుకోవాలి. బలవంతపు భూసేకరణ, సాగునీటి సమస్య, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు పెరుగుదల, పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవటం, మార్కెట్ సౌకర్యం, దళారుల దోపిడీని గ్రహించి, ఈ మౌలిక సమస్యల పరిష్కారం కోసం పాలకులకు వ్యతిరేకంగా యావన్మంది రైతాంగం ఉద్యమించాలి.

oooooo